# పదహారు గంటల కలహం

-ఐ.ఎ.నరసింహం

ఉదయం ఎనిమిదిగంటలైంది. నేను ఇంటికి చేరుకున్నాను. మునివేళ్లతో తలుపు తట్టాను. లోపలెక్కడో ఉన్న మా బావ పుణ్యమూర్తికా శబ్దం వినిపించినట్లుంది. అప్పడే స్నానం చేసి వస్తున్నాడేమో ఏవో వచ్చీరాని దేవుని శ్లోకాలు చదువుకుంటూ వచ్చి తలుపు తెరిచాడు. ఎదురుగా తెల్లటి దుస్తుల్లో, చేతిలో బరువైన బ్యాగ్‌తో ఆరడుగుల పురుష విగ్రహంగా నన్ను చూసి తెగ ఆశ్చర్యపోయాడు.

"ఓహ్ బావా! ఏమిటోయ్ ఇదేనా రావడం?" ఈ పలకరింపు బాగానే వుంది.

"ఔనూ... నువ్వివాళ వచ్చావేంటి?"

ఈ రెండో వాక్యమే నాకు కొంచెం ఇబ్బంది పెట్టినట్టు అనిపించింది.

అక్కని, బావని చూసి చాలా రోజులైందని ఎన్నో కిలోమీటర్లు ప్రయాణం చేసి వస్తే బావ తనకిచ్చిన మర్యాద ఇదేనా? అనిపించింది. పెదవుల మీద చిన్న నవ్వుని సృష్టించుకుని లోపలకు ప్రవేశించాను.

"ఏరా తమ్ముడూ బాగున్నావా? అయ్యబాబోయ్ నువ్వివాళ వస్తున్నట్లు ఒక ఫోనన్నా చేయలేకపోయావా?" అంది అక్క రాజ్యలక్ష్మి.

నేను బెదిరిపోయాను. రెండుక్షణాల తరువాత తేరుకున్నాను.

"అది సరేగానీ అక్కా... మీరిద్దరూ నన్ను పలకరించిన తీరులో వాక్యాలు వేరైనా ఒకే అర్థంలో అడిగారు. నేను రావడం మీకిష్టం లేనట్టుంది" ముఖం ముందరే అడిగేసాను.

అక్క తడబడింది.

"అబ్బే అదేంలేదురా... ఇవాళ...ఇవాళ..." కొంచెం నసిగింది.

"ఓహ్... అర్థమయింది. ఈరోజు మీరిద్దరూ ఎక్కడికో వెళ్తున్నట్టున్నారు. నేను రావడం మీకిబ్బంది కలిగించింది కదూ!"

మా ఇద్దరి సంభాషణ బావ విన్నట్టున్నాడు.

"కంగారు పడకోయ్. మేమెక్కడికీ వెళ్లడం లేదు. ఇంట్లోనే ఉంటున్నాం. సరే నువ్వెళ్లి త్వరగా స్నానం చేసిరా. ఇద్దరం కలసి టిఫిన్ చేద్దాం" అన్నాడు.

అక్కకి కోపం వచ్చినట్టుంది.

"చూసావురా తమ్ముడూ! మీ బావకి నామీద వుండే అభిమానం? ఇక్కడ నేనొకదాన్నున్నానన్న ధ్యాసేలేదు. ఆయన దృష్టిలో నేనొక పనులు చేసిపెట్టే యంత్రాన్నేగానీ మనిషినికాను. ఏం మన ముగ్గురం కలసి టిఫిన్ చేద్దాం అనొచ్చుకదా" రుసరుసలాడింది.

ఆమెవేపు కొరకొరా చూసాడు బావ.

అంతే... నేను వారిద్దరి వంక కొంచెం భయంగా చూసాను.

"అదోయ్ వరస. మా ఇద్దరికి పెళ్లయి చాలా కాలమైంది. మీ అక్కకి ఇంకా నామీద కోపమే. నేనామెను చులకనగా చూస్తున్నానని, అస్సలు పట్టించుకోనని విపరీతంగా బాధపడిపోతూ వుంటుంది. ఊ అంటే తప్పు, ఆ అంటే తప్పు. నెలంతా ఆఫీసులో గాడిద చాకిరీ చేసి జీతం మొత్తం ఆమె చేతిలోనే పోస్తున్నాను. నాకెప్పుడూ స్వతంత్రంగా ఒక రూపాయి ఖర్చు పెట్టుకునే అలవాటులేదు. అసలు నాకు తెలీక అడుగుతాను నా మనస్తత్వం ఆమెక్కడ ఊహించినట్టు?" బావ వంటి కాలిమీద లేచాడు.

ఈ హఠాత్ పరిణామానికి అక్క బెంబేలెత్తిపోయింది.

"చూసావురా తమ్ముడూ! అంటే అక్కడికి నేనేదో డబ్బు మనిషిలాగా, అతనికేమీ అక్కర్లేనట్టు. ఆ డబ్బుతో నేనేం నగలు, చీరలు కొనేసుకుంటున్నానా... సంసారంలో ఇంటి అద్దె నుండి పాల వరకూ ముప్పై మూడు అవసరాలు తీర్చుకొస్తున్నాను. ఇంటి బరువు బాధ్యతలు తెలివిగా, ఓర్పుగా నెట్టుకువస్తున్నందుకు సంతోషించాల్సింది పోయి తిరిగి పుల్లవిరుపుగా మాట్లాడడం ధర్మమా? ఆయనకెవరు ఆ పేరు పెట్టారోగానీ మూర్తిని అలాగే ఉంచి ముందున్న రెండక్షరాలను తీసి వ్యతిరేకమైనవి పెడితే బావుణ్ణు" అంది అక్క సన్నగా కంట తడి పెడుతూ.

నా గుండె గుభేల్‌మంది.

అరగంట క్రితమే బస్సు ఆ ఊరి పరిసర ప్రాంతాల్లోకి దూసుకుపోతుంటే చాలా తృప్తిగా ఫీలయ్యాను.

అక్కకి ఇష్టమని ఏజెన్సీలో దొరికే సీతాఫలం పళ్లు, బావకి ఇష్టమని పొందూరు బట్టలు సంచిలో పెట్టుకుని మధురమైన ఆలోచనలలో బయలుదేరి రాత్రంతా ప్రయాణం చేసాను. తను చాలాకాలానికి చూడడానికి వెళ్తుంటే ఉత్తరం రాసినా, ఫోన్ చేసినా థ్రిల్ పోతుందని భావించాను. అకస్మాత్తుగా కనిపిస్తే ఇద్దరూ ఎంతో ఆనందంతో ఉబ్బితబ్బిబ్బైపోతారనుకుంటే వీళ్లిద్దరూ ఏంటీ అస్సలు తన గురించి పట్టించుకోకుండా కీచులాడుకుంటున్నారు.

వీరిద్దరిలో ఏమాత్రం సంస్కారం ఉన్నా ఒక్క రోజు నాతో సరదాగా గడపవచ్చుకదా. నేరకొచ్చానురా భగవంతుడా అనుకున్నాను.

"అక్కా! నేను చాలా పొరపాటు చేసాను. నాకు సెలవు దొరికితే ఏదో రెండురోజులు ఇలా మీతో గడపాలని వస్తే నా తిరుగు ప్రయాణం వెంటనే నిర్ణయించేస్తున్నట్టున్నారు" అనేసాను బాధగా.

అక్క కాస్త బెదిరింది.

"అయ్యయ్యో ఎంత మాటరా? నేను నిన్నేం అన్లేదు. ఆయన ధోరణి నన్ను బాధ పెడుతుంటే తట్టుకోలేకపోయాను. నువ్వెళ్లి స్నానం చేసిరా నేను మరి మాట్లాడను" భరోసా ఇచ్చింది.

"అదిగో అక్కడే నాకు అరికాలి మంట నెత్తికెక్కుతుంది. నువ్వు ప్రారంభించి మరి నోరెత్తనంటే ఎలా? అసలు నీ కడుపులో ఉన్న అక్కసంతా కక్కాలికదా. నేనేం తప్పులు చేసానో సాక్ష్యాలతో సహా నిరూపించు. అంతవరకూ టిఫినే కాదు, భోజనం కూడా చేయను" బావ కోపంతో ఊగిపోయాడు.

నాకు ఆ క్షణంలో జుట్టు పీక్కోవాలనిపించింది. ఆ పని చేయలేను. ఆ కోపంతో పొడవాటి బ్యాగ్ జిప్‌ను ఫర్‌మని లాగి అందులో ఉన్న వస్తువులేవో బైట పడేసాను.


సీతాఫలాలు చూసాక అక్కకి, బట్టలు చూసాక బావకి కళ్లు మెరిసాయి.

నేను వారిద్దరికీ అవి అందిస్తుంటే నా బాధ్యత తీర్చుకున్నానని తృప్తిపడ్డానో, నేరక కొన్నాను బాబు అని బాధపడ్డానో తెలుసుకునే ప్రయత్నం వారిద్దరూ చేయలేదు. చక్కగా అందుకున్నారు.

అరగంట తరువాత ముగ్గురం టేబుల్ దగ్గర కుర్చీల్లో కూర్చున్నాం.

"వారం క్రితం ఆయనగారి తమ్ముడు ఓ ఇరవై ముప్పై ఫోన్లు చేసి మా ఇంటికొస్తే అన్నిరకాల

పిండివంటలు చేసాను. ఏదో పొరపాటువల్ల కొన్ని టిలో ఉప్పుకారాలు ఎక్కువైనాయి. అదేదో నేను




ఇల్లు చాలా బాగుంది. పూజా మందిరం, కిచెన్, వెయిటింగ్ హాల్‌లో ఎక్కడుండవలసిన వస్తువులు అక్కడున్నాయి. పెరట్లో రకరకాల పూలమొక్కలు, నూతి దగ్గర పారిజాతం మొక్క, నిన్న సాయంత్రం పూసిన పూలు ఒక్కోటీ నేల రాల్తూ వెదజల్లే సువాసన ఇల్లంతా ఆక్రమిస్తుంటే తృప్తిగా ఆస్వాదిస్తూ వారిద్దరి వేపు చూస్తూ ప్రశంసాపూర్వకంగా తన మధురానుభూతిని వ్యక్తపరచాలనుకుంటే-

"ఏమోయ్! మీ అక్క చేసిన ఇడ్లీ, గారెలు ఎలా ఉన్నాయి?" బావ ఆ వాక్యం అక్కడితో ఆపితే-

"చాలా బాగున్నాయి మా అక్క అమృతహస్తంతో చేయడం బాగోలేకపోవడమూనా" అని మెచ్చుకోలుగా అనేవాడిని.

"ఇడ్లీలు సున్నపుముద్దల్లా, గారెలు బిళ్లపెంకుల్లా లేవు?" మొదటి వాక్యంతో ఇలా కూడా అన్నాడు.

ఆ ఉపమానాలకు నా ఆలోచనలు పెడతోవ పడితే అక్కకి ఒళ్లంతా కంపరమనిపించింది. ఆమె కళ్లల్లో మళ్లీ జలపాతాలు ఊరిపోయాయి. ఆ కోపంతోనే-

ఇష్టం లేకుండా చేసానని, నీకు మాత్రం చాలా రుచికరంగా పెట్టానని దెప్పి పొడుస్తున్నారు. నీకో విషయం తెలుసా? నేనోసారి బస్టాండ్‌లో వెయింగ్ మిషన్ మీద నిలబడితే ఓ టిక్కెట్ ముక్క బైటకొచ్చింది. అందులో నా బరువు తెలియజేస్తూ 'మీరెంతో అపురూపంగా కొనుక్కున్న వస్తువు మిమ్మల్ని జీవితాంతం హింస పెట్టగలదు' అనే వాక్యం కూడా ఉంది. బహుశా ఆ వస్తువు అంత కష్టం పుచ్చుకున్న ఈయనేనేమో'' అక్క ముక్కు చీదేసింది.

ఆ మాటకి బావ కోపం తారాస్థాయికి చేరినట్టుంది.


"నేను నిన్నేం హింస పెట్టడంలేదు. ఆ మాటకొస్తే నువ్వే పదిమందిని ఇబ్బంది పెట్టావు. నువ్వెక్కిన ఆ వెయింగ్ మిషన్ నీ బరువుకి తాళలేక ఫెళ్లుమని పగిలిపోలేదూ. ఆ తరువాత అక్కడున్నవారెవరూ మరి బరువును తెలుసుకోలేకపోయారుకదా'' అలా అంటూనే మరో పది వాక్యాలు పరుషంగా అని అక్కని దులిపేసాడు బావ.

నేను ప్రయాణంలో అలసిపోయినందుకో అనుక్షణం వారిద్దరి కీచులాటకో నా కడుపులో తిప్పడం ప్రారంభమయింది. ప్లేట్లో చేతులు కడుక్కుని లేచి వెళ్లిపోయాను. అది మొదలు వారిద్దరూ రాత్రి పదిగంటలవరకూ అనేక రకాల ఎత్తిపొడుపులతో ఒకర్నొకరు విమర్శించుకుంటూ, ద్వేషించుకుంటూ గడిపేసారు.



## కాసింత శ్రద్ధ!

తారలంటే జనానికి ఆసక్తి ఎక్కువ. అందుకే ఎప్పుడూ అలర్ట్‌గా ఉండాలంటోంది భూమిక. 'తారలకి అందరితో సన్నిహిత సంబంధాలు ఉండాలి. తారల జీవితం అంతా వారితోనే ముడిపడి ఉంటుంది. ఎలాంటి ఆవేశకావేశాలకు లోనుకాకుండా వారి అభిరుచికి తగ్గట్టుగా కెరీర్‌ని మలచుకుంటే చక్కగా ముందుకి సాగిపోవచ్చు' అంటోంది భూమిక.




***

"ఒరే తమ్ముడూ! బావగారు పేపరు పఠనంలో ఉన్నట్టున్నారు. నూతి దగ్గర వేడినీళ్లు పెట్టాను. స్నానానికి వెళ్లమను. ఆ విషయం గమనించకుండా బరబరా నీళ్లు తోడుకుని పోసేసుకోగలరు. అసలే కాస్త ఒళ్లు వెచ్చగా ఉందంటున్నారు. చన్నీళ్లు మంచిదికాదు'' అంది అక్క.

నాకు ఆశ్చర్యమేసింది. ఏమైనా బావలాంటిదికాదు అక్క. తన మనసుకి బావ మనసుకి ఎంత తేడా? నిన్నంతా బావను తన మాటలతో ఊదరగొట్టినా ఆమె గుండెలో బావపైగల ఆ ప్రేమకి మురిసిపోయాను.

"ఏమోయ్ లక్ష్మీరాజ్యం'' అక్కని గట్టిగా పిలిచాడు బావ.

'మీరు పేరు మార్చి లక్ష్మితో రాజ్యమేలుతున్నానని అంత ఎగతాళిగా పిలవక్కర్లేదు. నా పేరులో లక్ష్మిగాని నా చేతిలో రూపాయి ఉండదు''

ఆ పిలుపుతో అక్క భగ్గున మండి ఇలా అంటుందేమో...మళ్లీ వారిద్దరి మధ్య రామరావణ యుద్ధం మొదలవుతుందేమో చచ్చానురా దేవుడా అనుకున్నాను. అక్క చాలా సౌమ్యంగా పెదవులమీద చిరునవ్వుతో వచ్చి "ఏం కావాలండీ?'' అంది.

నాకు మళ్లీ వారిద్దరి ప్రవర్తన అర్థంకాక జుట్టు పీక్కోవాలనిపించింది.

బావేదో చెప్పాడు. అక్క సరేనంటూ ఇంట్లోకి వెళ్లిపోయింది.

"ఏమోయ్! నేను ఆఫీసుకు వెళ్లాలి. నువ్వూ అక్కా కలసి ఇవాళలా పార్కులు, సినిమాలు చూసుకుని రండి'' అన్నాడు బావ.

"బాగానే వుంది. చాలారోజులకు వచ్చాడు మా తమ్ముడు. ఆఫీసుకు సెలవుపెట్టి బయలుదేరండి'' అక్క చాలా ప్రేమగా అంది.

ఆ రోజు నిజంగా చాలా సంతోషంగా గడిపాం ముగ్గురం.

నిన్నంతా ఒకళ్లనొకళ్లు ద్వేషించుకున్నారు. ఇవాళ ఒకరు లేనిది మరొకరు ఉండలేరని నిరూపించుకుంటున్నారు. ఇదే మాట బైటికంటే-

"ఓహ్ అదా భార్యాభర్తల మధ్య కీచులాటలు గడ్డివరకల మంటలాగే ఉండాలిగానీ కంపుకొట్టే రబ్బరు టైర్లలా కాలకూడదు. సంసారంలో ఒడిదుడుకులకు ఇద్దరికి కోపతాపాలు రావడం సహజం. అలాంటి సమయంలో పరిధులు మరచిపోయి కీచులాడుకుంటే సంసారాలు కూలిపోతాయి. అందుకే నేనూ మీ అక్క పెళ్లయిన సంవత్సరంలోనే ఒక ఒప్పందం పెట్టుకున్నాం. ఒకరి అభిప్రాయాలు ఒకరికి నచ్చకపోతే నెలంతా ఓర్పు వహించి ఆ నెలలో ఒక రోజు సూటిపోటి మాటలతోనే దులిపేసుకోవాలి. మార్పులు చేర్పులు ఉంటే అప్పుడే నిర్ణయించేసుకోవాలి. ఆ మర్నాటి నుంచి మళ్లీ యధావిధిగా అన్యోన్యంగా ఉండాలి. ఇలా ఇంతకాలం కొనసాగిస్తున్నాం. నిన్నటిరోజున మేమిద్దరం కలహించుకోవాలని పదిహేనురోజుల క్రితమే డేట్ ఫిక్స్ చేసుకున్నాం. నువ్వు వచ్చాక ఆ డేట్ మార్చుకోలేకపోయాం'' ఇంకా ఏదో చెప్తూనే ఉన్నాడు బావ. నా బుర్ర తిరిగిపోయింది.

"ఏమోయ్ వచ్చేనెల ఇరవై ఐదున మనం పెళ్లికి వెళ్లాలికదూ'' నా ఆలోచనలు ఖండిస్తూ అక్కవేపు చూస్తూ అన్నాడు బావ.

"ఔను''

"ఐతే మన కలహం ఇరవై తొమ్మిదిన పెట్టుకుందాం'' అన్నాడు బావ.

"ఆగండాగండి. బావా! నాదో విన్నపం. ఆ రోజున్నా వీధిలో ఈ విషయం అర్థమయ్యేలా ఒక బోర్డు తగిలించు. నాలాగ ఏ అనామనుడో బలి కాకుండా ఉంటాడు'' అన్నాను వెటకారంగా.

ముగ్గురం ఒక్కసారి గొల్లున నవ్వుకున్నాం.

★